# జారుడుబల్ల

టిఫిన్ ముగించి వీధి అరుగు మీది వాలుకుర్చీలో చేరబడగానే, రంగనాధం మాస్టారి కళ్లు అలవాటు ప్రకారం ఎదురుగా పార్కులో ఆడుకుంటున్న పిల్లలపై పడ్డాయి. మునిసిపల్ స్కూల్లో తెలుగు మాస్టారిగా పని చేసి మూడేళ్లక్రితం రిటైర్ అయ్యారు రంగనాధంగారు. హడావుడిగా స్కూల్‌కి పరుగెత్తే జీవితానికి విముక్తి లభించింది. అప్పట్నుంచీ అరుగుపై వున్న వాలుకుర్చీలో కూర్చుని పార్కులో ఆడుకుంటున్న పిల్లల్ని చూడడం అలవాటు అయింది.



రంగనాధం మాస్టారు అక్కడ ఇల్లు కట్టుకునేటప్పటికి ఎదురుగా మునిసిపాలిటీ జాగా ఖాళీగా వుండేది. నాలుగేళ్ల క్రితం అక్కడ పెరిగిన తుప్పల్ని కొట్టించి, అందమైన పార్కుని ఏర్పాటుచేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఒక జారుడు బల్ల కూడా పెట్టారు. సర్వీసులో వుండగా ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ కూర్చునే తీరిక వుండేది కాదు. కానీ ఇప్పుడు అదే నిత్యకృత్యంగా మారింది.

ఆనందంగా ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తుంటే, రంగనాధంగారికి తాను కోల్పోయిన బాల్యం పదే పదే గుర్తొస్తోంది. తన తండ్రి తహసీల్దారు ఆఫీసులో గుమస్తా. అందరి మధ్యతరగతి కుటుంబీకులలాగే, పిల్లలు వేగం చదువుకొని చేతికి అందివచ్చి వేన్నీళ్లకు చన్నీళ్లు సంపాదించాలనే తపన తప్ప, బాల్యంలో పిల్లల సరదాలు తీర్చాలని తెలియనివాడు. అయినా అప్పట్లో పార్కులూ, జారుడుబల్లలూ, రంగుల రాట్నాలూ లేని ఊరు.

రంగనాధంగారి జారుడుబల్లపై జారాలన్న కోరిక కూడా, మధ్యతరగతి మానవుల తీరని అనేక కోరికల్లో ఒకటిగా మిగిలిపోయింది.

గేటు తీసిన చప్పుడుతో, ఆలోచనల్లోంచి బయటకు వచ్చారు రంగనాధంగారు. పెద్దకొడుకు ఉదయం ఇంటర్వ్యూకని వెళ్లాడు. ఇప్పుడు తిరిగి వస్తున్నాడు. వేలాడేసుకొని వచ్చిన ముఖాన్ని చూస్తూనే ఇంటర్వ్యూ రిజల్టు తెలిసిపోయింది. అయినా ఆశ చావక "ఏంటయింది?" అని అడిగారు.

"ఏముంది మామూలే" అన్నట్లు చూసి అక్కడే అరుగుపై కూలబడ్డాడు. "ఉద్యోగ ప్రయత్నాలు ఎన్ని చేసినా ఫలితం వుండదు నాన్నా. ఇది కంప్యూటర్ యుగం. వందమంది చేసే పనిని ఒక్క కంప్యూటర్ చేసేస్తుంది. ప్రతి ఆఫీసులోనూ, ఎంతమంది ఎంప్లాయీస్‌ని తగ్గించాం, ఇంకా ఎంతమందిని తగ్గించొచ్చు అని ఆలోచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయడం కన్నా, సొంతంగా బిజినెస్ చేయడం ఉత్తమం" అన్నాడు.

ఈ డిస్కషన్ రోజూ నడుస్తున్నదే. పిల్లలిద్దర్నీ ఉద్యోగ ప్రయత్నం చేయమని రంగనాధంగారు చెప్పడం, వాళ్లు బిజినెస్ మొదలుపెట్టేందుకు, అతను సర్వీసులో వుండగా కూడబెట్టింది, ప్రావిడెంట్ ఫండ్‌లో వచ్చింది అంతా ఇచ్చేయమని అడగడం మామూలయిపోయింది.

పెద్దకొడుకింకా నయం. మర్యాదగానే డబ్బు అడుగుతున్నాడు. చిన్నవాడికైతే కోపం జాస్తి. డబ్బిస్తారా లేదా అని బెదిరించేవరకు వచ్చాడు.

పిల్లలకు దాచుకున్న డబ్బంతా ఇవ్వడానికి రంగనాధంగారు జంకడానికి కారణం వుంది. జీతం పూర్తిగా వచ్చినన్నాళ్లూ బొటాబొటిగా ఖర్చులకు సరిపోయేది. పెన్షన్ ఎటూ చాలటం లేదు. పులిమీద పుట్రలా ఒకవైపు పెన్షనర్‌ల డి.ఎ.ని ప్రభుత్వం సరిగా రిలీజ్ చేయడం లేదు. అవతల బ్యాంక్ వడ్డీ రేట్లు నెలనెలకూ తగ్గిపోతున్నాయి. అందుకని, వచ్చిన డబ్బంతా చిట్‌ఫండ్ కంపెనీలో వేసి, ఆ వడ్డీ డబ్బుల్తో ఎలాగో నెట్టుకొస్తున్నారు. అదే కనుక తీసి పిల్లలకు ఇచ్చేస్తే, పెన్షన్‌తో ఇల్లు గడవడం అసంభవం.

అయితే పిల్లల భవిష్యత్తే ముఖ్యం అనుకునే మధ్యతరగతి మనస్తత్వం రంగనాధంగారిని జయించింది. "సరే, రేపే వెళ్లి చిట్‌ఫండ్‌లో డబ్బు డ్రా చేసి తీసుకొని రా. దాంతో మీ బిజినెస్ స్టార్ట్ చేద్దురుగాని" అన్నారు రంగనాధంగారు. పెద్దకొడుకు ముఖం వెలిగిపోయింది.

మర్నాడు ఉదయాన్నే రంగనాధంగారి దగ్గర సంతకాలు తీసుకొని, పిల్లలిద్దరూ చిట్‌ఫండ్ కంపెనీకి బయలుదేరారు. వెళ్లిన అరగంటలోనే తిరిగివచ్చిన పిల్లలు చెప్పిన వార్తతో కళ్లు తిరిగాయి రంగనాధంగారికి. చిట్‌ఫండ్ కంపెనీవాడు రెండురోజుల క్రితమే బోర్డు తిప్పేసి వెళ్లిపోయాడు. అయోమయంగా శూన్యంలోకి చూస్తూ "ఇప్పుడెలా?" అన్నారు.

"ఏముంది? ఈ ఇల్లు అమ్మేస్తే సరి. ఆ డబ్బుతో మేం బిజినెస్ మొదలుపెట్టవచ్చు. అందాకా ఇల్లేదైనా అద్దెకు తీసుకుందాం" నిర్లక్ష్యంగా అంటున్నాడు చిన్నకొడుకు.

కాళ్లక్రింద భూమి కదిలిపోతున్నట్లుంది రంగనాధంగారికి. మెదడుకి ఆలోచనాశక్తి పూర్తిగా నశించింది. "అలాగే. ఇల్లమ్మేసి అద్దింట్లోకి వెళ్దాం" అన్నారు.

మెల్లగా నడుచుకుంటూ వెళ్లి అరుగు మీది వాలుకుర్చీలో కూలబడ్డారు. అలవాటు ప్రకారం కళ్లు, ఎదురుగా పార్కులో వున్న జారుడుబల్ల మీద జారుతున్న పిల్లలపై పడ్డాయి. కానీ, ఇప్పుడు అతని చూపుల్లో జారుడుబల్లపై జారాలన్న కోరిక లేదు. 'జీవితం' అనే జారుడుబల్లపై పూర్తిగా క్రిందకి జారిపోయారు.

**-బి.హెచ్.వి.నాగేశ్వరరావు** (రాయగడ)

